ద్వైమాసపత్రిక
వేకువ యోచన చేతన
# జాగో ఆన్‌లైన్
జూన్-జూలై 2019 బెల్లంపల్లి నుండి వెలువడుతున్న మొట్టమొదటి స్వతంత్ర మీడియా సంచిక 13

## ఉపవాసంలో పరమార్థం ఇదే...

మహ్మదీయులకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసంలో వారు తప్పనిసరిగా పాటించవలసిన విధి - ఉపవాసం. ఖురాన్‌లో చెప్పబడిన ప్రకారం - ఈ ఉపవాసం సన్మార్గులుగా మారటానికి ఉద్దేశించబడినది.

ఇక్కడ మనకు - సంవత్సరం మొత్తంలో కేవలం ఒక నెల పగటి పూట ఉపవాసం ఉన్నంత మాత్రాన మనిషి సన్మార్గుడైపోతాడా? అన్న సందేహం రావొచ్చు. అయితే, ఉపవాసం అంటే ఏంటి? ఎందుకు దీనికి ఇంత ప్రాముఖ్యత ఇవ్వబడింది? అన్న విషయం మనం తెలుసుకుంటే మనకు ఈ అనుమానం తీరిపోతుంది.



ఉపవాసం అంటే ఉదయం నుండి సాయంత్రం వరకు ఆహార పానీయాలు మానేయడం మాత్రమే కాదు. ఉపవాసం అంటే కడుపుతో పాటూ శరీరమంతా ఉపవసించాలి. అంటే, మన దృష్టి సక్రమంగా ఉండాలి. చెడు మాటలూ, చెప్పుడు మాటలూ వినకూడదు. నాలుకతో తిట్లూ, చాడీలూ, అబద్ధాలూ పలకకూడదు. ఎవరితోనూ గొడవ పడరాదు. చేతులు ఎలాంటి చెడు పనులకు పూనుకోకూడదు. కాళ్ళు చెడు మార్గంలో నడవకూడదు. మనసులో కూడా ఎలాంటి చెడు ఆలోచనలు రాకూడదు. ఇదే నిజమైన ఉపవాసంగా చెప్పబడింది.

రోజువారీ భోజన విధానానికి ఉపవాసం ఒక నియంత్రణగా పనిచేస్తుంది. అలాగే, ఆకలితో ఉన్న వ్యక్తికి ఊరకే కోపం రావడం సహజం. అటువంటి పరిస్థితిలో కూడా సంయమనాన్ని పాటించడం ఈ ఉపవాస కాలంలో అలవాటవుతుంది. మిగిలిన 11 నెలలు ఎలా గడపాలో తెలుస్తుంది. ఒక్క పూట కూడా అన్నం దొరకని పేదల ఆకలి బాధలు అనుభవంలోకి వస్తాయి. అలాంటి వారిని ఆదుకోవాలనే ఆలోచన వస్తుంది.

ఇన్ని విధాలైన భౌతిక, మానసిక ప్రయోజనాలు ఉన్నాయి కాబట్టే, ఉపవాసానికి అంత ప్రాముఖ్యత ఇవ్వబడింది. ఇది, కేవలం మహ్మదీయులకు మాత్రమే ఉద్దేశించినది కాదు. ప్రతీ వారికీ మొక్కుల పేరిట ఉపవాసం ఉండే అలవాటు ఉంటుంది. ఆ ఉపవాసాన్ని పైన చెప్పిన విధంగా శరీరమంతటినీ ఉపవసింపచేసినట్లయితే... సరైన ఫలితం ఉంటుంది. ఉపవాసం యొక్క పరమార్థం శరీరం మరియు మనసుని ఆరోగ్యంగా ఉంచుకోవడం మాత్రమే.

ప్రేమతో మీ భరత్ ఋషి




మహ్మదీయ సోదరులు, మిత్రులకు
**రంజాన్ శుభాకాంక్షలు**

# పిల్లలు ఆనందంగా బడికి వెళ్ళలేరా?

**ఎప్పుడు బడికి వెళ్ళమన్నా పిల్లలు ఏడుస్తారు. ఎందుకని?**

**మిగతా అన్ని విషయాలలో పిల్లల్లో ఉండే ఉత్సాహం ఒక్క చదువు దగ్గరికి వచ్చేసరికి ఉండదు. ఎందుకని?**

**బడి కూడా ఇల్లులాంటిదే అని, గురువు కూడా మనలాగా మామూలు మనిషే అని పిల్లలు అనుకోలేకపోతున్నారు. ఎందుకని?**

**ఎప్పుడైనా ఆలోచించారా..?**

వేసవి సెలవులు అప్పుడే అయిపోయాయి. ఈ నెల (జూన్)లో బడులు మొదలవుతాయి.

బడి మొదలైనా, బడికి సెలవులొచ్చినా ఎవరికేమో కానీ తల్లితండ్రులకు మాత్రం తగని తిప్పలు. పిల్లల్ని పొద్దున నిద్ర లేపే దగ్గర నుండి వాళ్ళని బడికి సిద్ధం చేసి, బ్యాగూ, క్యారియర్ సర్ది, స్కూల్ బస్ ఎక్కించేదాకా ఒకటే టెన్షన్.

మళ్ళీ సాయంత్రం వాళ్ళు వచ్చాక నిద్రపోయేదాకా మరో రకం టెన్షన్. ఇక సెలవులొస్తే వాళ్ళని పట్టలేం. ఎక్కడికెళ్ళి ఏ దెబ్బ తగిలించుకుంటారో అని, ఎవ్వరి నుండి ఏం గొడవ తెస్తారోనని పరేషాన్ తల్లితండ్రులకి.



సరే, మన ముచ్చట తల్లితండ్రుల టెన్షన్ గురించి కాదు కదా... పిల్లల గురించి.

అసలు, పిల్లలకు బడితో, బళ్ళో మాస్టార్లతో ఎందుకు సాన్నిహిత్యం కుదరట్లేదు? ఎందుకని పిల్లలు బడి అంటేనే భయపడిపోతారు? ఇంట్లో, స్నేహితులతో ఉన్నంత ఉల్లాసంగా, ఉత్సాహంగా బడిలో ఎందుకు ఉండలేకపోతున్నారు???

## సమస్య ఎక్కడుంది?

ఏ తల్లితండ్రులైనా తమ పిల్లల్ని గొప్ప స్థాయిలో ఉండాలనే చదివించాలనుకుంటారు. అందుకు తమ ఆర్థిక స్థాయికి మించి ఖర్చు పెట్టి, చదివించడానికి సిద్ధమైపోతారు. కానీ, ఈ చదువుల్లో అంత స్థాయి ఉందా? అని మాత్రం ఆలోచించట్లేదు.

ఇక, ప్రైవేటు, కార్పోరేటు స్కూళ్ళ వాళ్ళకు.. ఏ పేరు చెప్పి, తల్లితండ్రుల నుండి ఎంత ఫీజు పిండుదామా? రోజులో ఉండే 24 గంటల్లో ఎంత ఎక్కువ సేపు విద్యార్థులను చదువు పేరుతో హింస పెడదామా అని తప్ప వేరే ఆలోచనే ఉండదు.

విద్యార్థులకు కాసింత ఆహ్లాదంగా గడిపే అవకాశం ఇద్దాం, వారికి మానసికంగా ఒత్తిడి లేకుండా చూద్దాం అని అటు తల్లితండ్రులు కానీ, ఇటు ఉపాధ్యాయులు కానీ అనుకోవట్లేదు.

రెగ్యులర్ క్లాసులతో పాటూ స్పెషల్ క్లాసులు పెట్టి మరీ బోధించి, బాధించి, వేధిస్తుంటారు. ఇది చాలదన్నట్టు మళ్ళీ స్టడీ అవర్స్ కూడా. లేచిందగ్గర్నుండీ చదువూ..చదువూ..చదువూ...!!! వేరే ముచ్చటే లేదు.

ఒకసారి రాస్తే నాలుగు సార్లు చదివినట్టే అని ఎవరన్నారో కానీ, దాన్ని పట్టుకుని టెక్స్ట్‌బుక్, క్లాస్ నోట్స్ గైడ్‌లు, హోంవర్కు, ప్రాజెక్ట్ వర్క్... రాసినదాన్నే మళ్ళీ మళ్ళీ రాయిస్తుంటారు.

ఇవి చాలవన్నట్టు, రోజువారీ పరీక్షలు, వారాంతపు పరీక్షలు, మాసిక, త్రైమాసిక, అర్థ వార్షిక, వార్షిక పరీక్షలు... ఇలా పిల్లల ప్రాణాల్ని తోడేసేవెన్నో.

ఈ చదువులు ఇంత రాక్షసంగా ఉండబట్టే కదా - ఎంతోమంది విద్యార్థులు అర్థాంతరంగా తమ జీవితాల్ని ముగించేసుకుంటున్నారు.

## చదివితే చాలా...

పరీక్షా ఫలితాలు వస్తే చాలు...పేపర్లు, టీవీల నిండా ప్రకటనల ప్రభంజనమే! కానీ, అదంతా ఒక మాయ! మార్కులూ, ర్యాంకులూ మాత్రమే జీవితమని, అవి సాధించలేని వాళ్ళు చావాల్సిందేనన్న భ్రమలోకి తల్లితండ్రుల్నీ, పిల్లల్నీ నెట్టేసే మహా మాయ!!

అయినా, కేవలం చదవేస్తేనే గొప్ప వాళ్ళయ్యేటట్టయితే ఇతర రంగాల్లో ప్రతిభావంతులు ఎందుకుంటున్నారు?

ఏమాత్రం అక్షర జ్ఞానం లేకున్నా ఉన్నత స్థానాలకు ఎదిగిన వాళ్ళు, అనితర సాధ్యమైన విజయాలు సాధించిన వాళ్ళు మన సమాజంలో లేరా?

ఈ చదువుల వల్ల మీ పిల్లలు ఎలా తయారవుతున్నారో గమనించారా?

బట్టీ పట్టే ఆలోచన తప్ప సొంత తెలివి ఉండట్లేదు. బళ్ళో పాఠాలు చక్కగా అప్పచెప్పగలరేమో కానీ, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొని బతకగల నేర్పు ఉండదు.

ఓ పద్ధతి తెలీదు. సంస్కారం తెలీదు. అవసరానికి కలిసే స్నేహాలు తప్ప ప్రాణం పెట్టే స్నేహాలు ఉండవు. బంధువులు తెలీదు. లోకజ్ఞానం ఉండదు.

మనుషుల్లా కాక... కీ ఇచ్చిన మరబొమ్మల్లాగా, యంత్రాల్లాగా తయారవుతున్నారు. వీళ్ళ వల్ల విద్యా సంస్థల, కార్పోరేట్ సంస్థల యాజమాన్యాలకు ఆదాయ వనరులుగా ఎవరికీ ఏ ఉపయోగం ఉండదు.

మీ పిల్లలకు ఇలాంటి చదువులు అవసరమా?!

ఇదే చదువు...ఇదే నీకు మంచిదని మీరే నిర్ణయించేయకుండా వాళ్ళకు నచ్చిన రంగంలోకి వారిని వెళ్ళనిస్తే ఏదైనా సాధిస్తారో లేదో కానీ, కనీసం, సంతోషంగా మీ కళ్ళ ముందు ఉంటారు కదా. అందరిలా కాకుండా తమ ఇష్టాలకూ, ఆలోచనలకూ విలువనిచ్చే తల్లితండ్రులుగా మీ గురించి గర్వంగా చెప్పుకుంటారు కదా! ఏమంటారు?!


జాగో ఆన్‌లైన్

**కొత్త రాతగాళ్ళు**

## కన్నా...!

కన్నా...

కనులు మూస్తే చాలు

అలలా ఎగసే నీ ఊహలు

కనులు తెరిస్తే చాలు

వలలా అల్లేసే నీ తలపులు

ఏమని చెప్పను

ఎంతని చెప్పను

నీపై వెర్రి ఆశలు పెట్టుకునే నాకే తెలుసు

నీ స్నేహం కోసం నేను చేసే నిరీక్షణ

నీ గురించి పిచ్చి రాతలు రాసే నా కలానికే తెలుసు

నీ కోసం నా మనసు పలికే ఆలాపన



నా హృదయ కోవెలలో వెలసిన దీపంలా

నీ పరిచయంతో నా జీవితానికే పునర్జన్మనిచ్చిన,

నా హృదయానికే వెలుగునిచ్చిన నేస్తమా...

నీ స్నేహం లేని నా జీవితం శూన్యం

ఎన్ని కాలాలు మారినా

ఎన్ని యుగాలు మారినా

ఎడబాటు లేని స్నేహంగా

మన స్నేహం ఇలాగే నిలిచిపోవాలని ఆశిస్తూ...

## క్షణమైనా చాలునులే...



నీపై నమ్మకం కన్నా

ఎందుకంటే...

ప్రతీ క్షణం నువ్వు నన్ను బాధపెట్టినా

ఏడుస్తూ నేను భరించేది ఎందుకో తెలుసా...

ఎప్పటికైనా నువ్వు నన్ను సంతోషపెట్టే

ఒక్క క్షణం వస్తుందని!

- ఓ. మేఘన, బెల్లంపల్లి.

## నన్నే ముంచే నీ ప్రేమలో...

'నన్ను ప్రేమించవూ' అని నిన్ను

బతిమాలుకోవాలనుంది

నువ్వొప్పకోనంటే బతుకే దండగని

నీ కాళ్ళు పట్టుకోవాలనుంది

'నీ ఖర్మ ఏడువ్' అనైనా సరే

నువ్వనేదాకా విసిగించాలనుంది

ఇలా ప్రేమని అడుక్కోవడం నా

ఈగోకి కంపరంగానే ఉంది కానీ

నువ్వు తలపుకు రాగానే

ఈగోలన్నీ తోకముడుస్తున్నాయి

నిన్ను తలచుకోని క్షణముందా అసలు !

నువ్వు నా దరికి రాగానే

ఇష్టాలన్నీ మారిపోతున్నాయి

నువ్వున్నది నాలోనే కదా మరి !

మిన్నూ మన్నూ ఏకం చేసైనా

నిన్ను చేరాలనుంది

ఇదే చివరాఖరు

ఇంక ప్రేమించనెవ్వరినీ

సరే అంటే నువ్వూ నాతో

ససేమిరా అంటే నేనే నాతో

ఒంటరినై సాగమంటావో...

జంటై సాగుదామంటావో....

నీ వలపుల తలపులతో

పులకింతల కలవరింతలలో

కలవరపడుతూ నేనేం

రాసానో తెలీకనే రాసానిది

తప్పల్ని మన్నించి నిన్నే

తలపోసే మది గోడు ఆలకిస్తావు కదూ !!

- మోనా.




జాగో ఆన్‌లైన్

కథ

# నీ స్నేహం

**మన జీవితంలో ఎందరో పరిచయమవుతుంటారు. కొన్ని పరిచయాలు ఆనందాన్నిస్తాయి. కొన్ని పరిచయాలు అనుభవాన్నిస్తాయి. కొన్ని పరిచయాలు జ్ఞాపకాల్ని మిగులుస్తాయి. అయితే, చాలా కొద్ది పరిచయాలు మాత్రమే ఇవన్నింటినీ ఇస్తాయి. అలాంటి పరిచయమే నాకు తనతో కలిగింది.**

నాకు తనంటే ఇష్టం. 'ఇంత' అని చెప్పలేనంత ఇష్టం. 'ఎందుకంత' అంటే తెలీనంత ఇష్టం. తన మాటలో మాయేం ఉందో తను సోది చెప్పినా నాకది బావుంటుంది. చామన ఛాయలో తళుక్కుమనే తన పేరు వెన్నెల.

* * *

నేను డిగ్రీ ఫైనలియర్‌లో ఉండగా తను మా కాలేజ్‌లో ఫస్టియర్‌లో చేరింది. ఒక కామన్ ఫ్రెండ్ ద్వారా నాకు పరిచయమైంది. నా ఫ్రెండ్ నన్ను స్టూడెంట్‌గా కాక సరదాకి లెక్చరర్‌గా పరిచయం చేసింది. వెన్నెల అది నిజమే అని నమ్మింది. అప్పట్నించీ కనపడితే విష్ చేసేది. నేనూ క్యాజువల్‌గా విష్ చేసేవాణ్ని. తర్వాతెప్పుడో నిజం తెలిసినా తను నన్ను 'సర్' అనటం మానలేదు.

'ఎందుకలా' అడిగానోసారి.

"అలవాటైపోయింది సర్!" అంటూ నవ్వేసింది తను.

చూడగానే ఆకర్షించేది అందం. చూడగా చూడగా ఆకట్టుకునేది కళ. అది చూసే కొద్దీ ఆనందమిస్తుంది. వెన్నెలలో అలాంటి కళే కనిపించేది. అదీగాక తన తోటివాళ్లలాగా ఫ్యాషన్స్‌కీ, ఆడంబరాలకీ పోయేది కాదు. చాలా సింపుల్‌గా ఉండేది. అందుకేనేమో తనంటే ఇష్టం కలిగింది. ఇంకా చెప్పాలంటే, సరిగా చెప్పలేని ఒక రకమైన ఆరాధన కూడా కావచ్చు.

నిజానికి తనపై ఈ ఇష్టాలన్నీ తను పరిచయమైన కొత్తలో లేవు. మరి, ఏ క్షణంలో కలిగాయంటే చెప్పలేను. కానీ, అప్పటి నుండి తను ప్రత్యేకంగా కనపడటం మొదలైంది. తన చూపూ, మాటా, నవ్వూ, తన ప్రతీ కదలికా నాకు అద్భుతంగా తోచసాగింది. క్రమంగా తను నా జీవితంలో ప్రత్యేకం అయిపోయింది.

* * *

విన్నూతో పాటూ ఎప్పుడూ ముగ్గురు స్నేహితులు ఉండేవాళ్ళు. వాళ్ళే - సబిహా, సౌమ్య, శ్రీవాణి. ఇందులో సబిహా భలే చిత్రమైన అమ్మాయి. కుదురుగా ఒక చోట అసలే ఉండదు. ఎప్పుడూ గంతులేస్తున్నట్టే అటూ ఇటూ తిరుగుతూ ఏదో ఒక గలాటా చేస్తూనే ఉంటుంది. తనది చిన్న పిల్లల్లాంటి మనస్తత్వం. ఉత్తినే అలుగుతుంది. మళ్ళీ ఎప్పుడు మామూలవుతుందో ఎవరం చెప్పలేం. వాళ్ళ నాన్నకు తనంటే అమితమైన ప్రేమ. తనూ అంతే. ఎప్పుడూ వాళ్ళ నాన్నతో అనుబంధం గురించే మాట్లాడుతుంటుంది. తన మాటలు వింటుంటే ఆకాశమంత సినిమా గుర్తొచ్చేది నాకు.

ఈ నలుగురూ ఎక్కడున్నా తెగ సందడి చేస్తుంటారు. నేనూ ఆ సందడిలో చేరిపోయేవాణ్ని అప్పుడప్పుడూ.

సీనియర్లకూ, జూనియర్లకూ క్యాంపస్‌లు వేర్వేరుగా ఉంటాయి కదా! మా క్యాంపస్‌కి ఒక చివర ఉంటే వాళ్ళ క్యాంపస్ మరో చివర ఉండేది. మధ్యాహ్నం లంచ్ అవర్‌లో నేను గబగబా తినేసి, ఆ క్యాంపస్‌కి పరుగెత్తుకెళ్ళేవాణ్ని. ఏదో కాసేపు విన్నూతో మాట్లాడి, కాసేపు ఉడికించి, కాసేపు నవ్వించి, ఆ నవ్వుల్నీ అనుభూతుల్నీ గుండెల్లో నింపుకుని, మా క్యాంపస్ వైపు వెళ్ళిపోయేవాణ్ని. ఇదంతా ఎంత సేపు.... కేవలం ఐదు నిమిషాలే ! ఆలస్యం చేస్తే ప్రమాదం తరుముకొస్తుంది. ఆ ప్రమాదం పేరు సత్యనారాయణ సర్ - మా ప్రిన్సిపల్. ఆయన అనుక్షణం విద్యార్థుల్ని గమనిస్తూనే ఉంటారు. దేన్నైనా భరిస్తారు కానీ, అమ్మాయిలూ, అబ్బాయిలూ స్నేహంగా ఉండటాన్ని అస్సలు భరించలేరు. అందుకని ఆయన కళ్లపడకుండా ఏదోలా తప్పించుకొచ్చి విన్నూని కలిసేవాణ్ని. ఒక్కోసారి అది కుదిరేది కాదు.

ఇక ఆరోజుకి కాలేజ్ ముగిసాక మాత్రమే విన్నూని చూసే వీలు కుదిరేది. అప్పుడు తను 'బై' చెప్తుందేమోనని రోజూ ఎదురుచూసేవాణ్ని. కానీ, తనెప్పుడూ చెప్పేది కాదు. నన్ను గమనించకుండా, తన బ్యాచ్‌తో వెళ్ళిపోయేది. మళ్ళీ తనొచ్చే రేపటి కోసం జ్ఞాపకాలతో ఆరోజు పూర్తయ్యేది నాకు. కానీ, చివరికి ఆ జ్ఞాపకాలే మిగులుతాయని నాకేం తెల్సు...!?

* * *

**నా ఒంటరితనపు సమాధిగోడల్ని**
**బద్దలుకొట్టి నాలోకి ప్రవేశించావు**
**ప్రియమారా నే హత్తుకున్న బిడియపు తెరల్ని**
**చీల్చి నన్ను స్నేహంగా పలకరించావు**
**నిన్ను చూసి ఉప్పొంగే నా మది**
**చంద్రుని చూసి విరిసే కలువది....**

తరువాతి వాక్యం ఎలా రాయాలా అని నేను జుట్టు పీక్కుంటున్నంతలో వచ్చాడు రామ్. చదివి, ఎలా ఉందో చెప్పమన్నాను.

"డౌట్ లేదు. లేట్ చేయకుండా తనకు వెంటనే చెప్పేసెయ్" అన్నాడు వాడు తాపీగా.

నేను కంగారుపడ్డాను. వాడు ఇలా అంటాడని నేను ఊహించలేదు.

"రేయ్! నువ్వనుకున్నట్టేం లేదు. తను నాకు మంచి ఫ్రెండ్. తన పట్ల నాకు వేరే ఉద్దేశం ఏమీ లేదు" చెప్పాను వాడితో.

"మరి, ఈ కవితలూ.. ఇదంతా ఏంట్రా?" నమ్మనట్టుగా అన్నాడు.

"తనని చూడాలన్పిస్తుంది. తనతో మాట్లాడాలన్పిస్తుంది. తనతో ఉంటే సంతోషంగా ఉంటుంది. ఏదైనా ఆనందమొచ్చినా, బాధొచ్చినా తనతో పంచుకోవాలన్పిస్తుంది. తనని చూస్తూ, అప్పుడప్పుడూ అలా మాట్లాడుతూ, సరదాగా గడిపేస్తే చాలన్పిస్తుంది. ఇదంతా స్నేహపూర్వకంగానే. తనని ఇంకోలా ఊహించుకోలేను" అని ఒక్క క్షణం ఆగి చెప్పాను.

"రైతుకు వర్షం కావాలి. కానీ, మబ్బు పట్టినా, చినుకు రాలినా సంబరపడిపోతాడు. నేనూ రైతులాంటి వాణ్ణే. నాకు స్నేహం కావాలి. నా జీవితంలో కరువైన స్వచ్ఛమైన స్నేహం ఏ కొంచెమైనా వదులుకోవడానికి సిద్ధంగా లేను"

"తనకు చెప్పావా ఇదంతా ?"

"దాని కోసమే ఒకటి ప్లాన్ చేసాను" స్టైల్‌గా చిటికేసి, చెప్పాను.

"ఏంట్రా అది?"

"చెప్పను...చూపిస్తా"

★ ★ ★

**మోస్ట్ ఇంపార్టెంట్ డే ఆఫ్ ఎవ్రీవన్స్ లైఫ్... ఈజ్ ద డే దట్ దే బార్న్**

కంప్యూటర్ తెర నిండా పరుచుకున్న ప్రకృతి దృశ్యాల బ్యాగ్రౌండ్‌లో డిస్‌ప్లే అవుతున్న వాక్యాల్ని ఒకింత ఆశ్చర్యంతో, ఎంతో ఉద్వేగంతో చదువుతోంది వెన్నెల.

**ఐ ప్రామిస్ టు మేక్ దిస్ డే..మోస్ట్ వండ్రఫుల్ అండ్ బ్యూటిఫుల్...**

**జస్ట్ లైక్ "యు"**

తరువాత....

**సో... ఇవాళ నీ పుట్టిన రోజు..హ్యాపీ బర్త్‌డే టు యు** అంటూ తెరపైకి దూకుడుగా దూసుకొచ్చాడు మహేష్ బాబు.

మహేష్ తన ఫేవరెట్ హీరో. తన కళ్ళు సంభ్రమంతో మెరిసాయి.

"ఇలాంటిదేదో ఉంటుందని అనుకున్నా" అంది నవ్వుతూ, తెరపై నుండి కన్ను తిప్పకుండానే.



ఆపై తెరంతా చీకటి పరుచుకున్నట్లు నల్లగా మారిపోయింది. ఉన్నట్టుండి ఓ భారీ పేలుడు...వేలాదిగా పూలు తెరంతా పరుచుకుంటూ 'హ్యాపీ బర్త్‌డే టు యు' అన్న అక్షరాలు వచ్చాయి. మధ్యలో మెరుపు మెరిసింది. ఆ మెరుపులో అందంగా తళుక్కుమంది - 'వెన్నెల' పేరు.

తరువాత సీన్ మారింది. అందమైన తీగలు ఒకదాన్నొకటి అల్లుకుంటూ, మధ్య మధ్యలో రంగు రంగుల పూలు పూస్తూ, వాటిలోంచి ఒకటొకటిగా అక్షరాలు జాలిపడుతున్నాయి.

**ఇష్టమైన వాళ్ళకి..ఇష్టాన్ని ఇష్టం కన్నా ఇష్టంగా చెప్పకపోతే.. ఇష్టానికున్న ఇష్టం పోతుందట**

**అందుకే, .నాకెంతో ఇష్టమైన నీకు ..మరెంతో ఇష్టంగా ఇస్తున్న ఈ కానుకని..నువ్వూ ఇష్టపడతావనే అనుకుంటున్నాను**

మళ్ళీ మెరుపు మెరిసింది...ఈ సారి తన కళ్ళల్లో.

"నాకు నచ్చింది" తనలో అనుకుంటున్నట్టుగా పైకే అనేసింది తను.

'హమ్మయ్యా... నా ప్రెజెంటేషన్ విన్నూకి నచ్చింది. ఫుల్ హ్యాపీ! దిల్ ఖుష్!!'

★ ★ ★

ఆరోజు చాలా సంతోషంగా ఉన్నాను. నా జీవితంలో ఏరోజూ లేనంత సంతోషంగా, ఉత్సాహంగా. అలా అలా ఒంటరిగా ఆరోజు ఆనందానుభూతుల్ని, ఆ క్షణాల్ని గుర్తు చేసుకుంటూ పార్క్‌లో నడుస్తున్నాను. ఇంతలో సెల్ 'బీప్'మంది. 'వన్ మెసేజ్ రిసీవ్డ్' అని చూపిస్తోంది. చూస్తే ఏదో కొత్త నెంబరు నుండి - 'థ్యాంక్స్ ఫర్ యువర్ టెడ్డీ... దిసీజ్ వెన్నెల'.

నా ప్రెజెంటేషన్ కన్నా ముందు ఓ టెడ్డీబేర్ కొన్నా. చక్కగా గిఫ్ట్ ప్యాక్ చేయించి, సౌమ్య ద్వారా వెన్నెలకి ఇప్పించా - నేనే ఇచ్చానని చెప్పకుండా. ఇంటికెళ్ళిన తరువాత తను వెన్నెలకి చెప్పిందట.

'యు ఆర్ ఆల్వేస్ వెల్‌కమ్' అని రిప్లై ఇచ్చాను.

కాసేపటికి మరో మెసేజ్...

"డు యు వాంట్ ఎనీ రిలేషన్ షిప్ ఆర్ ఫ్రెండ్‌షిప్ - ఫ్రమ్ ఎనీబడీ?"

ఇదేంటీ, ఉన్నట్టుండి ఇలా అడిగింది తను? ఏదో తేడాగా అనిపించింది.

'ఐ వాంట్ ఓన్లీ ఫ్రెండ్‌షిప్ - ఫ్రమ్ ఎవ్రీబడీ' అని రిప్లై ఇచ్చాను.

ఈసారి రిప్లై నాకు షాక్ ఇచ్చింది.

'బట్, ఐ డోంట్ వాంట్ ఎనీ ఫ్రెండ్‌షిప్ ఆర్ రిలేషన్ షిప్ ఫ్రమ్ ఎనీవన్. బై '

సర్రున కోసినట్టు ఉన్న ఆ మెసేజ్ చదివి, ఘ్రాన్పడిపోయాను. నా ఇష్టాన్ని వేరేలా అర్థం చేసుకుందా? నా ప్రవర్తన తనకు తప్పుగా తోచిందా? అదే అడిగాను. కానీ, తను అలాంటిదేం లేదు అంది. మరి, ఎందుకు ఇలా? అంటే 'అదంతే' అంది. నాకు ఏమనాలో తోచలేదు. నిలబడ్డ చోటే కూలిపోయాను. నరాలు తెగిపోతున్నంత బాధతో మనసు మూల్గింది. స్వచ్ఛమైన స్నేహాన్ని మాత్రమే కదా నేను కోరుకున్నది. మరెందుకు తనలా అందో నాకు అర్థం కాలేదు. స్నేహం ముసుగులో ప్రేమ ఉందని అనుమానపడిందా? లేక నిజంగానే తనకు స్నేహాలూ, అనుబంధాలంటే ఇష్టం లేదా? ఇష్టం లేకుంటే ఇంత కాలం బానే ఉంది కదా! ఇప్పుడేమైంది?

★ ★ ★

ఆ దెబ్బ నుండి కోలుకోవడానికి చాలా రోజులు పట్టింది. మధ్యలో ఫోన్ చేస్తే కట్ చేసేది. మెసేజ్ చేస్తే రిప్లై ఇచ్చేది కాదు. అయినా, తను అర్థం చేసుకుంటుందనే ఉద్దేశంతో తనపై నా
ఉద్దేశాన్ని మెసేజ్ చేసేవాడ్ని. ఒక రోజు సబిహా నుండి మెసేజ్ - వెన్నెల తన నెంబర్ డిలీట్ చేయమందని, ఇకపై మెసేజ్ చేయొద్దనీ చెప్పిందని. తనకు డిలీట్ చేసానని చెప్పాను. నిజానికి చేయలేకపోయాను. అయితే, మెసేజ్ చేయడం మానుకున్నాను.

**మన జీవితంలోకి ఎందరో వస్తుంటారు. కొందరు మనతో ఉండి, మనల్ని ప్రేరేపిస్తారు. కొందరు మనల్ని వదిలేసి మనల్ని గెలిపిస్తారు. ఏమో! నేనూరుకుంటే తానే పలకరిస్తుందేమో! కొంగొత్త ఆశల రేపు కనికట్టు చేసి కనికరిస్తుందేమో! కనిపించకుండా ఉండి, బతికించే నమ్మకంతో నీకై వేచి ఉంటా నేస్తం.....**

- క్రిష్ ●

# ఎలా రాస్తారండీ బాబూ...!

భరత్ ఋషి

**ఎక్కడో దూరాన కూర్చుని - ఇక్కడి మన ఆలోచనలను బుర్రలోకి దూరి, చదివేసినట్టే... మన అనుభవాలను పక్కనుండి చూసినట్టే... రాసేస్తారు!**

**మనం చెప్పాలనుకునే ప్రేమ...చెప్పలేని బాధ...**

**క్షణకాలముండే మోహం...కలకాలముండే స్నేహం...**

**జీవిత కాలం వేధించే విరహం...**

**పుట్టిన దగ్గర నుండీ చివరి దాకా మన అనుభూతులూ, అనుభవాలూ, ఆశలూ, గోసలూ.... ప్రతీదీ వాళ్ళకు బాగా తెలిసినట్టే రాసేస్తారు. అంత అద్భుతంగా 'ఎలా రాస్తారండీ బాబూ' అనిపిస్తారు. అక్షరాలతో చిత్రమైన గారడీ చేస్తూ, తమాషా చూసే ఆ సాహిత్య మాంత్రికుల చమత్కారాలు కొన్నింటిని చూద్దామా!**

**ప్రియతమా...ప్రియతమా.. *(మజిలీ)***



మనుషులు ప్రేమించుకోవడం మొదలైనప్పటి నుండీ గెలిచిన ప్రేమ కథలు ఎన్ని ఉన్నాయో ఒంటరి ప్రేమలు అంతకు మించి ఉంటాయి. ఇష్టమైన వారికి ప్రేమని చెప్పలేక, వారిపై ప్రేమని దాచుకోలేక సతమతమవుతుంటారు ఒంటరి ప్రేమికులు.

*ప్రియతమా..ప్రియతమా... పలికినది హృదయమే సరిగమా... /*
*చిలిపి నీ తలపులో తెలిసినది వలపులో మధురిమా...*

మనసైన వాళ్ళని చూడగానే హృదయం ప్రేమ సరాగాలు పలుకుతుంది. వారి గురించి చిలిపి ఆలోచనల్లోనే ప్రేమ తీయదనం అనుభవమవుతుంది.

*ఇష్టమైన సఖుడా...ఇష్టమైన సఖుడా..*
*ఒక్కసారి చూడరా పిల్లడా...*

ఆ అమ్మాయి/అబ్బాయి మన వైపు కనీసం ఒక్కసారైనా చూస్తే పరవశించిపోతాం. యథాలాపంగా ఒక్క మాట మాట్లాడితే, ఈ జన్మకదే చాలనుకుంటాం. కానీ, అలా జరగదు కదా. చాలా సార్లు భరించలేని బాధనిపిస్తుంది. కొన్నిసార్లు అదే బావుందనిపిస్తుంది. ఏమైనా ఒంటరి ప్రేమలో ఉండే ఆనందమే వేరు.

**మాటే వినదుగ *(టాక్సీవాలా)***

సంతోషాన్ని ప్రతీవాళ్ళూ కోరుకుంటారు. కానీ, నసతీ ఎక్కడుంటుంది? ఎలా దొరుకుతుంది?

*చిన్న చిన్న నవ్వులే వెతకడమే బతుకంటే*
*కొన్ని అందులోన పంచవ మిగిలుంటే*

బాగా డబ్బుంటేనే...చిటికెస్తే అన్నీ జరిగిపోయేంత పెద్ద స్థానంలో ఉంటేనే సంతోషంగా ఉంటామని అనుకుంటూ ఉంటాం. కానీ,



చిన్న చిన్న విషయాల్లోనే మనం వెతికే ఆనందం ఉంటుందని, అలాంటి ఆనందాల్ని మనతో ఉన్న వాళ్ళకి కూడా పంచడమే కదా జీవితమంటే.

*కష్టాలెన్ని రానీ..జేబే ఖాళీ కానీ.. -*
*నడుచునులే...బండి నడుచునులే/*
*దారే మారిపోనీ..ఊరే మర్చిపోనీ -*
*వీడకులే...శ్రమ విడువకులే*

జీవితమన్నాక కష్టాలూ, నష్టాలూ పలకరిస్తూనే ఉంటాయి. అలాగే, ఎన్నో జరగాలని అనుకుంటాం. ఏదో చేద్దామనుకుంటాం. ప్రతీసారి అలా జరగదు కదా. మనం ఇష్టపడ్డ రంగంలో కాకుండా వేరే రంగంలో పనిచేయాల్సి రావొచ్చు. అయిన వాళ్ళకు దూరంగా వేరో చోటెక్కడో ఉండాల్సి రావొచ్చు. అంతమాత్రాన, జీవితం ఆగిపోదు కదా. దానిపాటికది నడుస్తూనే ఉంటుంది. మనం చేయాల్సిందల్లా శ్రమకు వెరవకపోవడమే.

**ఏమైపోయావే... *(పడి పడి లేచే మనసు)***

*ఏమైపోయావే.. నీ వెంటే నేనుంటే*
*ఏమైపోతానే.. నీవంటూ లేకుంటే*

ప్రేమలో కానీ, స్నేహంలో కానీ జీవితాంతం మనతో ఉండాల్సిన వాళ్ళు మధ్యలోనే వదిలేసిపోయినప్పుడు అప్పటిదాకా మనతో ఉండి, ఉన్నట్టుండి ఏమైపోయారో అన్న అనుమానం, వాళ్ళు లేకపోతే మనం ఏమైపోతామో అనే భయం పుట్టుకొస్తాయి.

*నీతో ప్రతీ పేజీ నింపేసానే...*
*తెరవక ముందే పుస్తకమే విసిరేసావే/*
*నాలో ప్రవహించే ఊపిరివే...*
*ఆవిరి చేసి, ఆయువునే తీసేసావే*



మనల్ని మనం వారికి అర్పించేసుకుంటాం. మన జీవితంలోని ప్రతీ క్షణాన్నీ వారికి అంకితం చేసేస్తాం. కానీ, వాళ్ళు ఇదేమీ పట్టనట్టు అర్థాంతరంగా మధ్యలో ఒంటరి చేసి, వెళ్ళిపోతారు.

*ఎటు చూడూ నువ్వే..ఎటు వెళ్ళనే / నేలేని చోటూ నీ హృదయమే*
*నువ్ లేని కల కూడా రానే రాదే / కలలాగ నువ్ మారకే...*

ఎక్కడికి వెళ్ళినా, ఏం చేసినా వారి జ్ఞాపకాలుంటాయి. కానీ, వాళ్ళ హృదయంలోనే మనకు చోటు లేకపోతే...

మనం కనే ప్రతీ కలా వారి గురించే. వాళ్ళు లేకపోవడాన్ని కలలో కూడా ఊహించలేని మన జీవితంలో వాళ్ళు కలలాగా మారిపోతే... ఆ వేదన ఇలాగే ఉంటుంది కదా!

**(మరికొన్ని సాహితీ చమత్కారాలు వచ్చే సంచికలో)**

# పద వినోదం 4

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | * | 2 | | * | 3 | 4 | * | 5 |
| | * | 6 | | * | 7 | | | | |
| 8 | | * | | 9 | * | 10 | | * | * |
| | * | 9 | * | 11 | 12 | * | * | | * |
| 13 | | * | 14 | | | * | 15 | 16 | 17 |
| | | * | 18 | | | | * | 19 | |
| * | 20 | * | | * | | | | | |
| 21 | | | * | 22 | * | 23 | 24 | | |
| 25 | | | | | | * | | * | |
| 26 | | | | | 25 | * | 26 | * | |

**అడ్డం:**

1. రంధ్రం, చిల్లు (2)
2. ఎడిటింగ్.. తెలుగులో (2)
3. దండ (2)
6. వాడనని చెప్పండి (2)
7. కాకినాడలో నూతనంగా ప్రారంభించిన గస్తీ నౌక పేరు (5)
8. లోపలికి కాదు (4)
10. ఏనుగుని తోలేవాడ్ని ఇలా పిలుస్తారు (3)
11. పద్ధతి, తీరు (2)
13. సరైందా (3)
15. సినిమాల్లో ప్రత్యేక గీతం,........ సాంగ్, రివర్స్‌లో (3)
18. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఛీఫ్ జస్టిస్‌గా ఇటీవల నియమితులైన వారు (5)
19. నిజమా లేక ....? (2)
21. కారణాలు, సాకులు (3)
23. మంట పుట్టించే 'కారం', ఎగతాళిగా చేసేది (4)
25. ప్రముఖ బాలీవుడ్ దర్శక నిర్మాత (6)
26. సుజిత్, శర్వానంద్‌ల చిత్రం (6)

**నిలువు :**


1. గత నెలలో మరణించిన సీనియర్ నటులు రాళ్లపల్లికి నటుడిగా పేరు తెచ్చిన చిత్రం (6)
2. జంక్షన్, చౌరస్తా (3)
3. అదృశ్యమా (3)
4. వదిలిపెట్టను... కింది నుండి పైకి (3)
5. కీడు, ఆపద (2)
6. వ్యాపకంలో ఒత్తు లోపిస్తే... (3)
9. రాజులు తలపై ధరించింది (4)
12. జాతర (4)
14. అక్రమం కాదు (3)
16. తడుముకోకుండా, చక చకా (4)
17. ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత సమాచార కమీషనర్ (6)
20. ఉమ్మడి రాష్ట్రాల కొత్త ప్రిన్సిపల్ ఛీఫ్ కమీషనర్ (4)
21. సీద కాదు (3)
24. చాటింపు (3)

## పూరణం 4

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 తూ | టు | * | 2 కూ | ర్పు | * | 3 మా | 4 ల | * | 5 హా |
| ర్పు | * | 6 వా | డ | * | 7 ప్రి | య | ద | ర్శి | ని |
| 8 వె | లు | ప | లి | 9 కి | * | 10 మా | వ | టి | * |
| ల్లై | * | 9 కం | * | 11 రీ | 12 తి | * | * | * | * |
| 13 రై | టా | * | 14 స | ట | రు | * | 15 మ్ | 16 ట | 17 ఐ |
| లు | * | వి | 18 క్ర | మ్ | నా | థ్ | * | 19 క | లా |
| * | 20 శం | * | మం | * | ళ్ళు | * | * | ట | పు |
| 21 వం | క | లు | * | 22 ప | * | 23 వె | 24 ట | కా | రం |
| 25 క | ర | ణ్ | జో | హా | ర్ | * | ము | * | రా |
| 26 ర | న్ | రా | జా | ర | 25 న్ | * | 26 కు | * | జా |

### రక్తదానం చేయటం మంచిదేనా?

రక్తదానం ఇస్తే రక్తం తగ్గిపోతుందని, తరచుగా ఇస్తే బలహీనపడతామని మనలో కొన్ని అపోహలు ఉన్నాయి. నిజానికి, రక్తదానం వల్ల ఎలాంటి నష్టం ఉండదు. ఎన్నిసార్లు ఇచ్చినా బలహీనపడటం ఉండదు. రక్తదానం చేసిన 15 రోజుల్లో మనకు అవసరమైన రక్తం తిరిగి మన శరీరంలో తయారవుతుంది.



### రక్తదానం చేసేందుకు కొన్ని నియమాలు

- రక్తదానం చేసేందుకు 3 గంటల ముందు మంచి భోజనాన్ని తీసుకోవాలి.
- దానం చేసిన తరువాత పండ్లు, పండ్ల రసాలను తప్పనిసరిగా తీసుకోవాలి. దాని తరువాత మంచి భోజనం చేయాలి.
- దానం చేసే రోజు, దానికి ముందు రోజూ సిగరెట్ తాగకండి.
- అలాగే దానం చేయడానికి 48 గంటల ముందు మద్యం సేవించకండి.


# సాంకేతిక పదాలు - పూర్తి రూపాలు

నిత్య జీవితంలో మనం వింటుండే వివిధ సాంకేతిక పదాల యొక్క పూర్తి రూపాలు ఇవిగో...

| | |
|---|---|
| SEO | Search Engine Optimization |
| GPS | Global Pointing System |
| SEA | Search Engine Advertising |
| SMO | Social Media Optimization |
| SMM | Social Media Marketing |
| GA | Google Analytics |
| ToS | Terms of Service |
| HITS | Hyperlink-Induced Topic Search |
| AI | Artificial Intelligence |
| SQL | Structured Query Language |
| SOAP | Simple Object Access Protocol |
| IPSec | Internet Protocol Security |
| OSS | Open Source Software |
| OS | Operating System |
| DNS | Domain Name System |
| HTTP | Hyper Text Transport Protocol |
| HTTPS | Hyper Text Transport Protocol Secure |
| CDN | Content Delivery Network |
| LAN | Local Area Network |
| WAN | Wide Area Network |
| IP | Internet Protocol |
| VLAN | Virtual Local Area Network |
| VIP | Virtual IP |
| FTP | File Transfer Protocol |
| AP | Access Point |
| MAC | Media Access Control |
| URL | Uniform Resource Locator |
| PDF | Portable Document Format |
| IE | Internet Explorer |
| WPAN | Wireless Personal Area Network |
| WLAN | Wireless Local Area Network |
| LCD | Liquid Crystal Display |
| LED | Light Emitting Diode |
| VIRUS | Vital Information Resources Under Siege |
| ALU | Arithmetic Logic Unit |
| UPS | Uninterruptible Power Supply |
| WINDOW | Wide Interactive Network Development for Office Work Solution |
| TBps | Terabits per second |
| KBps | KiloBytes Per Second |
| MBps | Megabytes Per Second |
| GB | Gigabytes |
| TB | Terabytes |
| HDD | Hard Disk Drive |
| DDR | Double Data Rate |
| CDR | Compact Disk Recorder |
| RAM | Random Access Memory |
| ROM | Read Only Memory |
| BIOS | Basic Input Output System |

## మీకు నచ్చే యూట్యూబ్ ఛానల్స్

మిమ్మల్ని ఉత్సాహపరిచే, విజయం వైపు నడిపించే ఉత్తేజకరమైన వీడియోలు, లేటెస్ట్ వాట్సప్ స్టేటస్‌లు, ఇతర వీడియోల కోసం




షార్ట్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీలు మరియు
బెల్లంపల్లికి సంబంధించిన ప్రత్యేక వీడియోల కోసం




**సబ్ స్క్రైబ్ చేసుకోండి...కొత్త వీడియోల నోటిఫికేషన్ కోసం బెల్ ఐకాన్‌ని క్లిక్ చేయండి**

## రచనలకు ఆహ్వానం

'జాగో ఆన్‌లైన్ ప్రెస్' పత్రిక కోసం విద్యార్థుల నుండి రచనలని ఆహ్వానిస్తున్నాము. మీ భావాలకూ, ఆలోచనలకూ అక్షర రూపం ఇవ్వండి. కథ, కవిత, గేయం... ఇలా మీ రచన ఏదైనా, సొంతంగా, తెలుగులో రాసినదై ఉండాలి.
ప్రతీ రచనకి హామీపత్రం తప్పనిసరి.
మీ జీవితంలో మీకెదురైన సరదా సంఘటనలను కూడా పంపొచ్చు.
వ్యాఖ్యానం ఆసక్తి ఉన్న విద్యార్థులు తాము రాసిన లేదా విన్న కథ/కవిత/పాటలను అభినయ పూర్వకంగా వివరించవచ్చు. వాటిని చిత్రీకరించి, 'జాగో ఆన్‌లైన్ ప్రెస్' యూట్యూబ్ ఛానెల్‌లో అప్‌లోడ్ చేయడం జరుగుతుంది.

'జాగో ఆన్‌లైన్ ప్రెస్' ని ఆన్‌లైన్ లో చదివేందుకు మరియు ఇతర పోస్టులు, వీడియోల కొరకు వెబ్‌సైట్

**https://jaagoonline.wordpress.com/**

మరియు

యూట్యూబ్ ఛానెల్

**jaago online press** చూడండి.

ఎడిటర్, డిజైనర్ భరత్ రుషి
సబ్ ఎడిటర్, పబ్లిషర్ అశోక్ పోతుగంటి

బెల్లంపల్లి నుండి ప్రచురితము

మీ రచనలు, పత్రికపై అభిప్రాయాలు, సూచనలు
కింది మెయిల్‌కి పంపండి.
jaago2409@gmail.com